క్లుప్తంగా

నేడు మండల సమావేశం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండల సర్వసభ్య సమావేశం సోమవారం జరగనుందని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఎంపీపీ సౌందర్య అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, వైస్ ఎంపీపీ కొండూరు విజయ్‌రెడ్డి హాజరు కానున్నట్టు చెప్పారు. అన్నిశాఖల అధికారులు సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

అభినందనలు


పర్వీన్‌కు అభినందనలు తెలుపుతున్న నేతలు

రాయచోటి అర్బన్ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్‌లు అన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితురాలైన షేక్ పర్వీన్‌ను ఆదివారం నేతలు ఆమె ఇంట్లోనే కలుసుకుని అభినందలు తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు

పుల్లంపేట : మండలంలోని కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బహుమతుల ప్రదానం

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లె సమీపంలో ఆదివారం మహమ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ఛాంపియన్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో యూసుఫ్ జట్టుపై ఆరిఫ్ ఖాన్ జట్టు విజయం సాధించింది. విజేతలకు నిర్వాహకులు అబ్దులా, అంజద్‌ఖాన్, అలీలు బహుమతులను ప్రదానం చేశారు.

ఓ చోట వెలుగులు.. మరో చోట చీకట్లు


రెడ్డిపల్లిలో పగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో విద్యుత్ దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. అదే అనంతంపల్లి గ్రామ పంచాయతీలో విద్యుత్ దీపాలు ఏడాది నుంచి వెలుగకపోయినా ఇంతవరకు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. విద్యుత్ దీపాలు వెలుగకపోవడంతో రాత్రి వేళ రోడ్డుదాటేటప్పుడు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని వెళ్లాల్సి వస్తుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన విద్యుత్ దీపాలకు మరమ్మతులు నిర్వహించి వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శిగా శ్రీహరి

గాలివీడు : వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం అన్నమయ్య జిల్లా కార్యదర్శిగా శ్రీహరిని నియమితులయ్యారు. ఈనెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎస్సీ సెల్ కమిటీని ఎంపిక చేశారు. ఇందులో మండల కేంద్రానికి చెందిన శ్రీహరిని కార్యదర్శిగా నియమించారు. తన నియమానికి సహకరించిన వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు కృతజ్ఞతలను తెలియజేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న దృశ్యం

గాలివీడు : మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని గేటు నాలుగు రోడ్ల కూడలిలో రాయచోటికి చెందిన శ్రీ దీపా బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఎస్ఎంఎస్ జ్యూస్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 46 మంది యువకులు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రామాంజులు, బాబ్జి, అజ్మతుల్లా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

వాల్మీకిపురం : నిరుపేదలు చలికాలంలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆదివారం స్థానిక కొత్తపేటవీధిలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ దుప్పట్లను పంపిణీ చేశారు. ప్రభుచరణ్ మట్లాడుతూ తెలంగాణకు చెందిన ఆషి సంస్థ అధినేత పూర్ణిరెడ్డి సహకారంతో తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- అక్కచెల్లెమ్మల మోముల్లో చిరునవ్వు చూడాలన్నదే సీఎం జగన్ ధ్యేయం
- జగనన్న మాటిచ్చారంటే నెరవేరుస్తారు
- నాల్గో విడత వైఎస్సార్ ఆసరా సదస్సులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడికోట, మండల నాయకులు


వైఎస్సార్ ఆసరా సభలో డ్వాక్రా మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : మహిళా సంక్షేమం, సాధికారతే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వైఎస్సార్ ఆసరా నాల్గో విడత మండల సదస్సులో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల మోముల్లో చిరునవ్వులు చూడాలన్నదే సీఎం జగన్ ధ్యేయమన్నారు. జగనన్న పాదయాత్రలో, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎన్నికల నాటికి ఉన్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని చెప్పి నేటికి సంపూర్ణంగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత మండలంలోని 674 సంఘాలకు రూ.4.03 కోట్ల మెగా చెక్‌ను ప్రజా ప్రతినిధులతో కలిసి అక్కచెల్లెమ్మలకు అందజేశారు. ఇప్పటివరకు వైఎస్సార్ ఆసరా ద్వారా రాయచోటి నియోజకవర్గంలో రూ.100 కోట్లుకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. డ్వాక్రా సంఘాలను జగన్ ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. పేదలకు భూ పట్టాలను ఇవ్వడం జరుగుతోందన్నారు. అసైన్‌మెంట్ కమిటీ పట్టాల పంపిణీ, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు.

జిల్లా కేంద్రాన్ని తరలించడం బాబు వల్ల కాదు..

టీడీపీ అధికారంలోకి వస్తే జిల్లా కేంద్రంగా రాయచోటిని తీసేసి మదనపల్లెను చేస్తామని చంద్రబాబు చెబుతున్నారని, రాయచోటి జిల్లా కేంద్రాన్ని తరలించడం చంద్రబాబు వల్ల కాదన్నారు. ప్రాణాలైన అడ్డుపెట్టి రాయచోటి జిల్లా కేంద్రాన్ని నిలబెట్టి తీరుతామన్నారు. జిల్లా కేంద్రాన్ని చంద్రబాబు నాయుడు తరలిస్తామని చెబుతుంటే ఈ ప్రాంత టీడీపీ నాయకులు ఏమి మాట్లాడకపోవడం దారుణమన్నారు.

వైఎస్ జగన్ పాండవ సైన్యం 'అక్కచెల్లెమ్మలే'

జగన్‌కు పాండవ సైన్యం మాదిరిగా అక్కచెల్లెమ్మలు, అన్ని వర్గాల ప్రజలు అండగా ఉన్నారన్నారు. టీడీపీ దగ్గర కౌరవ సైన్యం ఉందన్నారు. సీఎం జగన్ పద్మవ్యూహంలో చిక్కుకునే అభిమన్యుడు కాదని, అర్జునుడన్నారు. జగన్‌కు కృష్ణుడి రూపంలో అక్కచెల్లెమ్మలలు, ప్రజలు ఉన్నారన్నారు.

అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి...

జగన్ పాలనలో అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2.50లక్షల కోట్ల నిధులను వివిధ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్దిదారులకు ప్రభుత్వం అందించిందన్నారు. 33లక్షల మందికి పక్కా గృహాలను మంజూరు చేయగా, ఒక రాయచోటి నియోజకవర్గంలోనే 20 వేలకు పైగా పక్కా గృహాలు అందించామన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని అవి చేస్తాం, ఇవి చేస్తామని గొప్పలు చెబుతున్న పార్టీలు అధికారంలలో ఉన్నప్పుడు జగన్ తరహాలో ఈ మాదిరిగా సంక్షేమ పథకాలను అమలు చేసివుండొచ్చు కదా అని ప్రశ్నించారు. నిరంతరం ప్రజాశ్రేయస్సు ఆకాంక్షించే జగన్ ప్రభుత్వంపై తోడేళ్లు, గుంట నక్కలు, దుష్ట చతుష్టయలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలే తిప్పి కొట్టాలన్నారు. జగన్ వైపు ధర్మం, న్యాయం ఉన్నాయని, సీఎం జగన్‌కు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. చంద్రబాబు పాలన అంతా మోసం, దగాలతో నిండిందన్నారు. జగన్‌కు మళ్లీ సీఎం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబుకు ప్రజాదరణ లేకనే అందరితో పొత్తు పెట్టుకుంటున్నారని, దమ్ముంటే ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగాలన్నారు. ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవకే తన జీవితం అంకితమని, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిత్యం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, మండల కన్వీనర్ యదుభూషన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కర్ణపు విశ్వనాధరెడ్డి, వందాడి వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషన్‌రెడ్డి, వైస్ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, గుమ్మా అమర్‌నాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, దీప్తి, ఉమాపతిరెడ్డి, కేశవరెడ్డి, ఉమాప్రభాకర్, జానకి రామాంజులురెడ్డి, బాబాఫకృద్దీన్, నారాయణ, క్రిష్టారెడ్డి, మల్లికార్జున నాయుడు, ఎంపీటీసీ ఉల చిన్నరెడ్డి, చంద్రప్రకాష్‌రెడ్డి, చిన్నరెడ్డి, సచివాలయం కన్వీనరలు వెంకటాద్రి, హరినాధరెడ్డి, రాష్ట్ర వడ్డెలు కార్పొరేషన్ డైరెక్టర్ నగేష్, వాటర్‌షెడ్ చైర్మన్‌లు బసిరెడ్డి, రమణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్లు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తిరెడ్డి, శివగంగిరెడ్డి, ఆంజనేయరెడ్డి, వెంకటేష్, రమణ, జనార్ధనరెడ్డి, వెంకటాద్రి, వెంకటనారాయణరెడ్డి, రమణ, కోఆప్షన్ బాబాఫకృద్దీన్, సచివాలయం కన్వీనర్ నిజామొద్దీన్, వెంకటనారాయణరెడ్డి, వెంకట శివారెడ్డి, సమీర్, మహబూబ్ బాషా, మదుసూధన్‌రెడ్డి, నాయుడు, శ్రీహరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రంగా గండిమడుగు అభివృద్ధి

గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గండిమడుగు ఉమామహేశ్వర స్వామి ఆలయం వరకు రూ.27.50లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఉమామహేశ్వర, పాలేటి గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాట్లాడుతూ పవిత్ర స్థలమైన గండిమడుగును ఆధ్యాత్మికంగా, పర్యాటకంగానూ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులోని నీటి నిల్వలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వెంకట్రామిరెడ్డి

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు వివిధ రంగాలలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపును ఆయన ఆదివారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా రంగంలో కార్యకర్తలు రాష్ట్రపతి అవార్డును అందుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. విద్యతోపాటు కర్రసాము, నృత్యం, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రాజగోపాల్ రెడ్డి, స్కౌట్ మాస్టర్ భరత్ కుమార్, సీనియర్ క్రీడాకారులు గుండు మల్లికార్జున రెడ్డి, పల్లె గ్రీష్మంత్ రెడ్డి, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

31న మెగా జాబ్ మేళా

కురబలకోట : రాష్ట్ర నైపుణ్యాభివృదిధ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న మండలంలోని విశ్వం డిగ్రీ ,పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 20 కార్పోరేట్ కంపెనీలు పాల్గొంటున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బిటెక్, పీజీ చదివిన అభ్యర్థులు హాజరుకావచ్చన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుండి రూ. 30 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి ఓటు వినియోగంపై అవగాహన సదస్సు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : నేటి నుంచి ఈవీఎం ద్వారా ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీధర్ రావు తెలిపారు. 29న తిరుణంపల్లి, సిరివరం, ఎస్ఆర్ పురం, పెనగలూరు, ఇండ్లూరు పోలింగ్ బూత్‌లలో ఈవీఎంపై అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 30న పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, సింగారెడ్డిపల్లి, కంబాలకుంట, నడిమి సిద్దవరం, సాతుపల్లి పోలీస్ బూత్‌లలో, 31న కొండూరు, వీఎం పురం, వెలగచర్ల, గట్టువారిపల్లి, దామనచెర్లలోను, ఫిబ్రవరి 1న సింగనమల, ఓబులి, అత్తిగారిపల్లి, ఒడేటివారిపల్లి, ఈటమాపురం, నాయుడువారిపల్లిలో, ఫిబ్రవరి 2న దిగువనారాయణ నెల్లూరు, ఇసుకపల్లి, నల్లపరెడ్డిపల్లి, బెస్తపల్లి, 3న పొందలూరు, చక్రంపేట, కాకర్లవారిపల్లి, పేరంవారిపల్లి, అనంతంపల్లిలో, 5న ముద్రపల్లి, గోవిందంపల్లి, మూగవారిపల్లి, కట్టావారిపల్లి, అప్పారాజుపేట రేగుంటవారిపల్లి బూత్‌లలో ఈవీఎం ద్వారా ప్రజలు ఓటుహక్కు ఎలా వినియోగించుకోవాలో తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని ఓటును ఎలా వేయాలో తెలుసుకోవాలని తహసీల్దార్ కోరారు.

దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు


పుస్తకావిష్కరణలో మానవత సభ్యులు

రాయచోటి టౌన్ : దాతల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాల ఆవరణలో నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 250 సభ్యత్వాలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి 30 కుర్చీలు, రెండు టేబుళ్లు, ఒక బాడీ ఫ్రీజర్ వితరణగా అందజేశారు. అలాగే రాయచోటి సొసైటీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి సహకారాన్ని గుర్తించి ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న రైతు లోకేష్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. సంస్థ కార్యాలయానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు విన్నవించామని ఇందుకు సానుకూల స్పందన లభించిందని చెప్పారు. అనంతరం సంవత్సరం కాలంలో నిర్వహించిన సేవా కార్యక్రమాల వివరాలను తెలిపే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటరమణ నాయుడు, అరమాటి శివగంగిరెడ్డి, వెంకటరమణ, షకీల్, రెడ్డెన్న తాతిరెడ్డి, శేషారెడ్డి, పీరయ్య, రెడ్డప్పరెడ్డి, వెంకటరామరాజు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనా మందిరంలో దివ్య బలిపూజ


గురువులను సన్మానిస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : కడప మేత్రానులు గాలి బాలి తండ్రి కృతజ్ఞత దివ్య బలిపూజ సమర్పించి వారి పవిత్ర హస్తములచే సుమారు 40 మంది బాల బాలికలకు ప్రథమ దివ్య ప్రసాదం, భద్రమైన అభంగణం అనే పవిత్ర దివ్య సంస్కారాలు ఇచ్చారు. ఆదివారం ఆర్ఎస్ రోడ్డులోని కేథలిక్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 50 సంవత్సరాలుగా వారు పొందిన దైవ ఆశీస్సులకుగాను కృతజ్ఞతలు తెలియజేశారు. బిషప్ తండ్రి తమ అమూల్యమైన సందేశాలతో విశ్వాసులను ఆత్మీయ సంతోషములో ఎల్లప్పుడూ సుసంపన్నంగా ఉండాలనే బలిపూజను సమర్పించినట్లు తెలిపారు. పూజకు సీఎంసీ సిస్టర్స్, ఛారిట్ సిస్టర్స్ ఏర్పాట్లు చేశారు. విచారణ గురువులు ఊరి బాలస్వామి, కమిటీ సభ్యులు డి.భాస్కర్, జయపాల్, పి.సౌరి, పాపయ్య, జోసఫ్, సిలువయ్య సంఘసభ్యులు ప్రార్థనలకు హాజరైన గురువులను సన్మానించారు.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్ బాబు

రామాపురం : వాహనదారులు రహదారి భద్రతా నియమ, నిబంధనలు పాటించాలని లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్ బాబు తెలియజేశారు. ఆదివారం సీఐ మండల పరిధిలోని కొత్తరోడ్డు - నారాయణపురం పోలీస్ చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీ చేపట్టారు. మాట్లాడుతూ చేస్తూ ఎవరైనా వాహన డ్రైవర్లు మందు తాగి డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్ల లైసెన్సు, వాహనాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. వాహనాలలో మద్యం రవాణాపై నిఘా ఉందన్నారు. డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేశారు. ఆయనతోపాటు రామాపురం ఎస్ఐ బీఎల్ ప్రసాద్ రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

నాటు సారా విక్రేతల అరెస్టు

కలికిరి: నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. వివరాలిలా... కలికిరి పట్టణ పరిధిలో నాటు సారా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విస్తృత దాడులు నిర్వహించగా పాత బస్టాండ్ ఏరియాలో సారా విక్రయిస్తున్న మహిళ తులసిని, ఇందిరమ్మకాలని ప్రాంతంలో సారా విక్రయిస్తున్న గంగాధర్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా వీరికి రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. నాటు సారా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచడం జరిగిందని, పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. విక్రయదారులు స్వచ్ఛందంగా విక్రయాలను నిలిపివేయాలని పోలీసులు హెచ్చరించారు. ఎక్కువ సార్లు పట్టుబడితే పీడీ యాకట్ నమోదు చేస్తామన్నారు. దాడులలో హెచ్‌సీలు కొండప్ప, మనోహర్, రాజేంద్రప్రసాద్, పీసీలు వెంకటసిద్దులు, జిలానీ, దినేష్, గాయత్రి, సరస్వతిలు పాల్గొన్నారు.

గిరిజనుల విద్యాభివృద్ధికి విశేష కృషి

- ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


సుండుపల్లెలో గిరిజన గురుకులాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


గురుకలం ప్రారంభం అనంతరం విద్యార్థులతో రాజంపేట ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె(రాజంపేట) : రాష్ట్రంలో గిరిజనుల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేశారని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శనివారం సుండుపల్లె మండలంలోని పుల్లారెడ్డిగారిపల్లెలో రూ.24 కోట్ల వ్యయంతో నిర్మించిన గిరిజన గురుకల పాఠశాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి తీసుకొచ్చిన సంక్షేమ తదితర కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందన్నారు. దేశంలోనే మోడల్ సీఎంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గిరిజన గురుకల బాలుర సంక్షేమ పాఠశాల నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టును అభినందించిన ఎమ్మెల్యే

ఆడుదాం ఆంధ్ర క్రీడా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టును ఎమ్మెల్యే మేడా అభినందించారు. క్రీడలతో కూడా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యతో క్రీడలో కూడా రాణించాలన్నారు.

31న ఉచిత వైద్య శిబిరం

కలకడ : మండల కేంద్రంలో ఈనెల 31 నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సన్‌షైం ఆసుపత్రి డీఎంఓ వెంకటేశ్ కోరారు. కలకడ పోలీస్ సర్కిల్ కార్యాలయం ఆవరణంలో అన్ని జబ్బులకు ఉచితంగా చికిత్స చేసి, అవసరమైనవారికి మందులు కూడా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఆదివారం కలకడ, చుట్టుపక్కన గ్రామాల్లో ఆటోలో మైక్‌ద్వారా, కరపత్రాల పంపిణీ ద్వారా ప్రచారం నిర్వహించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

30న కౌలుకు ఆలయ భూముల వేలం

నిమ్మనపల్లె : మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను కౌలుకు 3 సంవత్సరాల కాలానికి బహిరంగ వేలం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మంజుల తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో తవళం గ్రామంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తు ముందుగా చెల్లించి వేలంలో పాల్గొని ఆలయ వ్యవసాయ భూములను కౌలుకు దక్కించుకోవచ్చని తెలిపారు.

విద్యా వ్యవస్థను కాపాడుకుందాం


మాట్లాడుతున్న ఏఐఎస్ఏ నాయకుడు లవకుమార్

రాయచోటి అర్బన్ : విద్యా వ్యవస్థను కాషాయమయం కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఏఐఎస్ఏ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లవకుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో కొత్త విద్యా విధానాన్ని అమలులోకి తెచ్చామని గొప్పలు చెబుతున్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. జాతీయ విద్యా విధానాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌తో ఫిబ్రవరి 1వ తేదీన చెన్నైలో మహార్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన విద్యా విధానం అమలు ద్వారా సెకండరీ విద్యను తుంగలో తొక్కి ఉన్నత విద్యను అయోమయస్థితిలోకి నెట్టేయడం దారుణమన్నారు. విద్యను పూర్తిస్థాయిలో కాషాయికరణ, ప్రైవేటీకరణ చేసేందుకు నూతన విద్యావిధానం దోహదపడుతోందన్నారు. నూతన విద్యావిధానం అమలుకు వ్యతిరేకంగా దేశంలోని విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రజాస్వామికవాదులు నిరసిస్తున్నా, ఉద్యమిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. చెన్నైలో నిర్వహిస్తున్న మహార్యాలీకి అందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. త్వరలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుతాన్ని గద్దె దించాలంటూ పిలుపునిచ్చారు.

పెద్దేరు పార్కులో అగ్నిమంటలు

తంబళ్లపల్లె : మండలంలోని కొటాల పంచాయతీలో ఉన్న పార్కులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పలురకాల పూలమొక్కలు, డ్రిప్ పైప్‌లు కాలిపోయాయి. సందర్శకుల కోసం రెండేళ్ల క్రితం ఉపాధిహామీ నిధులు సుమారు రూ.30 లక్షలు ఖర్చుచేసి పార్కును ఏర్పాటు చేశారు. రకరకాల పూలమొక్కలతో, ప్రాజెక్ట్‌కే కళ వచ్చింది. సందర్శకులను సైతం ఈ పార్కు ఆహ్లాదపరిచేది. గుర్తుతెలియని వ్యక్తులు చేసిన పనికి పార్కు అగ్నికి ఆహుతై కళావిహీనంగా మారింది. ఆదివారం పెద్దేరు ప్రాజెక్ట్ చూసేందుకు వచ్చిన సందర్శకులు పార్కు మంటలకు ఆహుతి కావడంపై విచారం వ్యక్తం చేశారు. అధికారులు పార్కును పునరుద్ధరించాలని సందర్శకులు కోరుతున్నారు.

భక్తులతో పోటెత్తిన అమ్మవారి ఆలయాలు


సంబేపల్లె: నల్లగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అనంతపురం గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ ఆదివారం భక్తుల విశేష పూజలు అందుకుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీందర్ రాజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అమ్మవారి దర్శనం కల్పించి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహింపజేశారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ


పూజలందుకున్న అనంతపురం గంగమ్మ

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారికి పలు రకాల అలంకరణలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.